


నేడు అక్కాయకుంట తిరునాళ్ల

నాదెండ్ల: ఎండుగుంపాలెంలో కొలువైయున్న అక్కాయకుంట సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరగనుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 517.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 3,031 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా వసంత నవరాత్రులు

తెనాలిటౌన్: శరణాగతి గోష్టి పీఠం ట్రస్ట్ నరేంద్ర రామానుజ దాస స్వామిజీ ఆధ్వర్యంలో వసంత నవరాత్రుల ఉత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

రేపు చిలకలూరిపేటలో ‘పీజీఆర్‌ఎస్’

నరసరావుపేట: వచ్చే సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)ను చిలకలూరిపేట పట్టణంలో నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఉదయం 10గంటలకు పీజీఆర్‌ఎస్ ప్రారంభమవుతుందన్నారు. ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నియోజకవర్గాల స్థాయిలో కార్యక్రమం నిర్వహించదలిచామన్నారు. అందులో భాగంగా తొలిసారిగా చిలకలూరిపేట నియోజకవర్గాన్ని ఎంపిక చేశామన్నారు. ఈ అవకాశాన్ని నియోజక ప్రజలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులతో కలిసి చిలకలూరిపేటలో ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని, అదే సమయంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సైతం ఫిర్యాదులు స్వీకరించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేటటౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 10న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ శనివారం తెలిపారు. అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, బ్యాంక్, రెవెన్యూ, మోటారు వాహన ప్రమాద, చెక్కు బౌన్స్, భరణం, కుటుంబ తగాదాలు, ముందస్తు వ్యాజ్యపు కేసులు పరిష్కారం అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకొని తమ సమయం, డబ్బును ఆదా చేసుకోవాలన్నారు.

హంస వాహనంపై శ్రీలక్ష్మీ నరసింహస్వామి



నగరంపాలెం: గుంటూరులోని ఆర్.అగ్రహారం శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం స్వామికి హంస వాహనంపై పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమాలను ఈఓ ఎస్.ఆంజనేయాచార్యులు పర్యవేక్షించారు.

రేపు పోలీసు పాత వాహనాల విడిభాగాల వేలం

నరసరావుపేట: పల్నాడు పోలీసు కార్యాలయంలో పోలీసు వాహనాలకు సంబంధించి వాడి తీసివేసిన సామగ్రిని ఈనెల ఏడవతేదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు ఎస్పీ కార్యాలయంలోని మోటారు వాహన కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

8 నుంచి చైత్రమాస బ్రహ్మోత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి చైత్రమాస బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 8వ తేదీ మంగళవారం నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 8వ తేదీ వెండి పల్లకిపై, 9న వెండి రథోత్సవం, 10న రావణ వాహనంపై, 11న నంది వాహనంపై, 12న సింహ వాహనంపై, 13 సాయంత్రం కృష్ణానదిలో నదీ విహారం ఉంటుంది. ఉత్సవాల్లో తొలిరోజు ప్రత్యేక పూజలు చేస్తారు. 11వ తేదీ రాత్రి 7 గంటలకు మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద రాయబార ఉత్సవం(ఎదుర్కోలు ఉత్సవం) జరుగుతుంది. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు ఆది దంపతుల దివ్య కల్యాణోత్సవం చేస్తారు. 12వ తేదీ సదస్యం, వేదస్వస్తి, వేదాశీస్సుల కార్యక్రమాన్ని మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తారు. 13వ తేదీ ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, ధాన్యకోట్నోత్సవం, వసంతోత్సవం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. 14వ తేదీ ద్వాదశ ప్రదక్షిణలు, 15, 16 తేదీల్లో పవళింపు సేవలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



కొల్లూరు మండలం గాజుల్లంక చినరేవు వద్ద వర్షపు నీటిలో నానుతున్న పచ్చి ఇటుక

అకాల వర్షం.. ఆశలు ఆవిరి

- తడిచి పాడైన పచ్చి ఇటుక
- వర్షం బారిన మొక్కజొన్న పంట



కొల్లూరు గాంధీనగర్ వద్ద వర్షానికి తడిచిన ఓదులపై ఉన్న మొక్కజొన్న కండెలు



కొల్లూరు మండలం ఆవులవారిపాలెంలో వర్షం బారిన పడకుండా మొక్కజొన్న గింజలు కాపాడుకునే యత్నంలో రైతులు

కొల్లూరు: అకాల వర్షం ఇటు రైతులను.. అటు ఇటుక ఉత్పత్తిదారులను నష్టాల పాల్జేసింది. శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా వర్షం కురిసింది. మండలంలో వందలాది ఎకరాలలో మొక్కజొన్న పంట వర్షానికి తడిచింది. ఇటుక రాయి పరిశ్రమపైనా వర్షం ప్రభావం తీవ్రంగా పడింది. రైతులు కల్లాల్లో ఆరపెట్టిన మొక్కజొన్న గింజల తోపాటు, మొక్కజొన్న కండెలను ఆరపెట్టుకునే వెసులుబాటు లేకపోవడంతో తడిచి పోయాయని రైతులు కన్నీరు పెట్టుకున్నారు. ఇటుక పరిశ్రమ ముగింపు దశలో ఉన్న తరుణంలో అకస్మాత్తుగా కురిసిన వర్షానికి మండలంలో సుమారు రెండు కోట్ల వరకు పచ్చి ఇటుక వర్షానికి తడిచి ఎందుకూ పనికిరాకుండా పోయింది. గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షం కారణంగా తడిచిన మొక్కజొన్న పంట రంగుమారి ధర తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక మొక్కజొన్నకు ఆశించిన ధర లభించని తరుణంలో వర్షం రూపంలో వచ్చిన విపత్తుతో మరింత ధర తగ్గిపోయి పెట్టుబడులు లభించవన్న భావన రైతుల్లో వెల్లడవుతుంది. ప్రస్తుతం పరిశ్రమ చివరి దశలో ఉండటంతో తడిసిన ఇటుకలను తొలగించి తిరిగి బట్టీలకు అవసరమైన పచ్చి ఇటుక తయారు చేయాలంటే శ్రమతోపాటు, ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా పరిశ్రమ నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఇటుక అమ్మకాలు మందగించి పరిశ్రమ ఒడిదుడుకుల్లో ఉన్న సమయంలో వర్షం కారణంగా ఏర్పడిన నష్టంతో ఇటుక ఉత్పత్తిదారులు కోలుకునే అవకాశం లేదన్న ఆవేదన పరిశ్రమదారుల్లో వ్యక్తమవుతుంది. వర్షం కారణంగా కొల్లూరులో పలు రహదారులు జలమయమవడంతోపాటు, డ్రెయిన్లో మురుగు పొంగి రోడ్లపైకి చేరడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- 24 గంటల్లోనే రూ.75 లక్షల సొత్తు రికవరీ
- అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపిన ఇంకొల్లు చోరీ కేసును బాపట్ల పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. రూ.75 లక్షల విలువైన నగదు, బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. వివరాలను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వెల్లడించారు. బాపట్ల జిల్లా ఇంకొల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 3 అర్ధరాత్రి సమయంలో ఇంకొల్లులోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా నివాసం ఉంటున్న జాగర్లమూడి శివ ప్రసాద్ ఇంట్లో చోరీ జరిగింది. చోరీలో రూ.55 లక్షల నగదు, రూ.24 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేశారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు క్లూస్‌టీం, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వివరాలు సేకరించి అంతర్రాష్ట్ర దొంగను అదుపులోకి తీసుకొని దొంగిలించిన సొత్తును రికవరీ చేశారు.

దొంగతనం జరిగింది ఇలా..

చోరీకు పాల్పడిన మహమ్మద్ షరీఫ్ తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మద్‌పురం గ్రామానికి చెందిన వ్యక్తి. ఇతను గతంలో చెంచల్‌గూడ సెంట్రల్ జైల్లో ఖైదీగా ఉన్నారు. ఆ సమయంలో అదే జైలులో గంజాయి కేసులో ముద్దాయి అయిన ఇంకొల్లు గ్రామానికి చెందిన సాయితో పరిచయం అయ్యింది. ఆ పరిచయంతో ఇరువురు స్నేహితులయ్యారు. వారిద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఈ ఏడాది మార్చి 30న షరీఫ్ ఇంకొల్లులోని సాయి ఇంటికి వచ్చాడు. సాయి నిర్వహిస్తున్న హోటల్‌లో వంట మాస్టర్‌గా చేరాడు. నాలుగు రోజులుగా పక్కా ప్లాన్ చేసుకొని ఈనెల మూడున అర్ధరాత్రి శివ ప్రసాద్ ఇంటి వెనుక వైపు ఉన్న మెట్ల ద్వారా గోడ పైకి ఎక్కి తాళాలు పగలకొట్టి పెంట్‌హౌస్‌లోకి చొరబడ్డారు. బాధితుడు రెండవ అంతస్తులో నిద్రిస్తుండగా మూడో అంతస్తులో ఉన్న బీరువా ఉన్న గది తాళాలు, బీరువా తాళాలను ఇనుప కడ్డీలు, రాడ్ల సహాయంతో పగలకొట్టి సొమ్మును దోచుకెళ్లారు. ముద్దాయిపై ఇప్పటికీ 14 కేసులు ఉన్నాయి.

రూ.75.50 లక్షల సొత్తు రికవరీ

చోరీ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు రూ.55.50 లక్షల నగదు, బంగారు గాజులు-7 జతలు (17 సవర్లు), బంగారు నానుతాడు-1 (2.5 సవర్లు), బంగారు గొలుసు-1 (రెండున్నర సవర్లు), బంగారు ఉంగరం-1 (అర సవరు), చెవి బుట్టలు ఒక జత (1/2 సవర్లు), చెవి దిద్దులు మూడు జతలు (3/4 సవర్లు) మొత్తం 24 సవర్ల బంగారం, వాటి విలువ రూ.20,00,000. మొత్తం విలువ రూ. 75.50 లక్షల సొమ్మును రికవరీ చేశారు.

పోలీసులకు అభినందన

నేరం జరిగిన 24 గంటలలోనే నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి చోరీ సొత్తు రికవరీలో ప్రతిభ కనబరిచిన చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్, ఇంకొల్లు సర్కిల్ సీఐ వై.వి. రమణయ్య, ఇంకొల్లు ఎస్‌ఐ జి.సురేష్, ఇంకొల్లు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జి.వీర్రాజు, కానిస్టేబుల్ కె.హరిచంద్రనాయక్, జి.కె.వి సుబ్బారావు, ఎ.ముకేష్‌వర్మ, హోంగార్డులు కె.పనిత్‌కుమార్, ఎన్.శరత్‌బాబులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతిని అందజేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడీ

గొప్ప సామాజిక సంస్కర్త డాక్టర్ జగ్జీవన్‌రామ్

- జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్
- ఘనంగా జయంతి వేడుకలు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల: గొప్ప సామాజిక సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహంలో శనివారం నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, ఆర్డీఓ పి గ్లోరియా తదితరులు పుష్పమాలలతో నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్‌ను ప్రేరణగా తీసుకుని విద్యార్థినులు ముందుకు సాగాలని చెప్పారు. ఎస్సీల నుంచి తొలి రాజకీయ నాయకుడు, భారత ఉప ప్రధానిగా ఎదిగిన గొప్ప వ్యక్తిగా ఆయన అభివర్ణించారు. మంత్రి పదవులను సమర్థంగా నిర్వహించారని, మంత్రిగా ఆయన పనిచేసిన కాలంలో హరిత విప్లవం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. పేదరికం నుండి వచ్చిన జగ్జీవన్‌రామ్ ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారని, భారతదేశ సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు చేశారన్నారు. ఆర్థికంగా అత్యంత వెనుకబడిన సామాజిక వర్గాలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రతినెలా మూడో శుక్రవారం ఎస్టీలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తున్నామని చెప్పారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా జిల్లాలో మూడు వేల మందికి ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందించామన్నారు. జగ్జీవన్ రామ్, అంబేద్కర్ సాధించిన విజయాలను భావితరాలకు వివరించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి కార్యక్రమాలను ప్రభుత్వ వసతి గృహాలలో నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలను ప్రభుత్వం దేవాలయాలుగా భావిస్తున్నందున ఇక్కడే నిర్వహిస్తామన్నారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ భారతమాత ముద్దుబిడ్డ జగ్జీవన్‌రామ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా సాధికారత అధికారి రాజ్ దెబోరా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఎస్ విజయమ్మ, ఎస్సీ, ఎస్టీ నాయకులు చారువాక, ఎన్ ధర్మానాయక్, జి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కాపులకు మొండి చెయ్యి

- మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా గొట్టిపాటి పూర్ణకుమారిని నియామకం
- ఆది నుంచీ కమ్మ సామాజిక వర్గానికే ప్రాధాన్యం
- రగులుతున్న కాపు సామాజిక నేతలు



వేమూరు మార్కెట్ యార్డు

వేమూరు: కూటమి ప్రభుత్వం వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి నియామకంలో కాపులకు మొండి చెయ్యి చూపించింది. చైర్మన్ పదవి కమ్మ సామాజిక వర్గానికి కేటాయించడంతో ఆ పదవిపై ఆశలు పెట్టుకున్న కాపు నాయకులు నిరాశకు గురయ్యారు. తెనాలి మార్కెట్ యార్డులో వేమూరు నియోజకవర్గం ఉంది. 2016లో తెనాలి మార్కెట్ యార్డు నుంచి విడిపోయింది. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాలు కలిసి వేమూరు మార్కెట్ యార్డుగా ఏర్పాటు చేశారు. వేమూరు నియోజకవర్గంలో ఎస్సీ ఓట్లు అధికంగా ఉన్నాయి. తర్వాత కాపు సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. నియోజకవర్గం ఎస్సీ రిజర్వేషన్ కావడంతో ఎమ్మెల్యే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఉన్నాడు. రెండో స్థానంలో కాపు సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉండటంతో మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కాపులకు కేటాయిస్తారని ఆశించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినపుడు కాపు సామాజిక వర్గం నాయకులను పక్కన పెట్టి కమ్మ సామాజిక వర్గం నాయకులకు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కట్టబెడుతోంది. 2014 తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టింది. 2016 మార్కెట్ యార్డు ఏర్పాటు చేశారు. 2017లో కమ్మ సామాజిక వర్గానికి చెందిన జొన్నలగడ్డ విజయబాబును మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమించారు. 2017 నుంచి 2019 వరకు ఆయన చైర్మన్‌గా ఉన్నారు. తిరిగి 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. తాజాగా మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కమ్మ సామాజికవర్గానికి చెందిన గొట్టిపాటి పూర్ణకుమారిని వరించింది. దీంతో తెలుగుదేశం పార్టీలో కాపు సామాజిక వర్గం చెందిన సీనియర్ నాయకులు నిరాశకు గురయ్యారు. నాయకుల తీరుపై మండిపడుతున్నారు.

వైఎస్సార్ సీపీలో కాపు సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యం

2019లో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కాపు సామాజిక వర్గానికి కట్టబెట్టి ప్రాధాన్యత కల్పించింది. నియోజకవర్గంలో ఎస్సీ సామాజిక వర్గం తర్వాత కాపు సామాజికవర్గం ఎక్కువగా ఉండటం వల్ల మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కాపులకు కేటాయించారు. 2020 మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కాపు సామాజికవర్గానికి చెందిన బొల్లిముంత ఏడుకొండలు పదవీ బాధ్యతలు చేపట్టారు. 2020 నుంచి 2023 వరకు ఆ పదవిలో కొనసాగారు. 2023 జూన్ నెలలో రెండో విడత ఆయనకే కేటాయించారు. కాపు సామాజిక వర్గానికి చెందిన మహిళ ఉప్పు శిరీషకు యార్డు చైర్మన్ పదవి ఇచ్చారు. ఆమె 2023 నుంచి 2024 వరకు ఆ పదవిలో కొనసాగారు. పార్టీ పదవుల్లోనూ కాపు సామాజికవర్గానికి అధిక ప్రాధా న్యం కల్పించారు. పార్టీ పదవుల్లోనూ కాపు సామాజికవర్గానికి టీడీపీ మొండి చెయ్యి చూపింది.

• కల్యాణం చూతము రారండి...



విద్యుత్ దీపాల వెలుగుల్లో రేపల్లె రైలుపేటలోని పట్టాభిరామస్వామి ఆలయం



బాపట్ల మండలం ముత్తాయపాలెంలో రామాలయం ముందు వేసిన చలువ పందిరి

జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి సందడి నెలకొంది. సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా రామాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయాల ముందు చలువ పందిళ్లు వేశారు. సీతారాముల కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. అన్నదానం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. - రేపల్లె రూరల్/ బాపట్ల టౌన్

చీరాల మున్సిపల్ కార్యాలయానికి తాళాలు

మున్సిపల్ కమిషనర్ బరితెగింపు

- బీసీ మున్సిపల్ చైర్మన్‌కు ఘోర అవమానం
- గేటు బయటనే బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



గేటు బయట జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు



మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసిన దృశ్యం

చీరాల: చీరాల మున్సిపల్ కమిషనర్ నియంతపోకడలు పోతున్నారు. అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నాయి. పట్టణ ప్రథమ పౌరుడు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావును కార్యాలయంలోకి వెళ్లనీయకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా సెక్యూరిటీని పంపి కార్యాలయానికి తాళం వేయించారు. ప్రతి ఏటా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు చైర్మన్ ఆధ్వర్యంలో కార్యాలయంలో జరుగుతాయి. ఈసారి మాత్రం చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతున్నారనే నేపథ్యంలో ఒక అడుగు ముందుకు వేసిన కమిషనర్ కౌన్సిలర్లు, చైర్మన్‌లు కార్యాలయానికి వెళ్లకుండా తాళాలు వేయించారు. అదేమంటే బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి రోజున సెలవు దినమని ప్రచారం చేయించారు. వాస్తవంగా అధికారులు, సిబ్బంది లేకున్నా చైర్మన్ తన ఛాంబర్‌లో మహనీయుల జయంతి వేడుకలను జరుపుకోవచ్చు. తహసీల్దార్ కార్యాలయంతోపాటు మిగిలిన ప్రభుత్వ కార్యాలయాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. కమిషనర్‌కు ఏమి ఆదేశాలు అందాయో ఏమోగాని రోజూ ఉండే సెక్యూరిటీ సిబ్బందిని బయటకు పంపి తాళాలు వేయడం విశేషం. దీంతో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్ బాబు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు గేటు బయటనే జగ్జీవన్‌రామ్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చైర్మన్‌ను అవమానించేందుకే...

వారు మాట్లాడుతూ కమిషనర్ ఒక బీసీ చైర్మన్‌ను అవమానించేందుకే కార్యాలయానికి తాళాలు వేశారని ఆరోపించారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. చైర్మన్‌నే లోపలికి రాకుండా తాళాలు వేశారంటే ఆ కమిషనర్‌కు ఉన్న అహంకారం అర్థమవుతుందన్నారు. కమిషనర్‌ను సస్పెండ్ చేసేంత వరకు పోరాడతామన్నారు. ఇటువంటి పరిస్థితి ఐదేళ్లలో ఎప్పుడూ జరగలేదని, ఇది చైర్మన్‌ను అవమానించడమేనన్నారు.

కమిషనర్ వైఖరిపై నిరసన

నిరసనగా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కమిషనర్ డౌన్.. డౌన్ అంటూ నినాదాలు చేశారు. వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామసుబ్బులు, కౌన్సిలర్లు గోలి జగదీష్, కంపా అరుణ్, గొట్టిపాటి ఎబినేజర్, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, గుంటూరు ప్రభాకరరావు, చీమకుర్తి బాలకృష్ణ, తోకల అనిల్, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ కబీర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు యాతం మేరిబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గవిని శ్రీనివాసరావు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు వాసిమళ్ల వాసు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్లీనర్‌ను ఢీ కొన్న లారీ



మేదరమెట్ల: ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపునకు వెళుతున్న లారీ మేదరమెట్ల పోలీసు స్టేషన్ సమీపానికి రాగానే శనివారం రాత్రి ఓ క్లీనర్ లారీకి రోడ్డుకు అడ్డంగా పరిగెడుతూ లారీకి అడ్డంగా వచ్చాడు. దీంతో లారీ క్లీనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన క్లీనర్ తలకు తీవ్ర గాయాలు కాగా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన వ్యక్తిది బళ్లారిగాను తన పేరు వెంకటేష్‌గా పోలీసులు తెలిపారు.


అలరించిన శ్రీరామ గానా మృతం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా భక్త నారద గాన సభ ఆధ్వర్యంలో శనివారం శ్రీరామ గానా మృతం నిర్వహించారు. కార్యక్రమాన్ని విశ్రాంత అదనపు ఎస్పీ కాళహస్తి సత్యనారాయణ, సంగీత విద్వాంసులు కె.వి.బ్రహ్మనందం, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ ఆకురాతి కోదండరామయ్య పాహి రామప్రభో, రామచంద్రుడితు రఘువీరుడు, ననుబ్రోవమని చెప్పవే, సీతా కళ్యాణ వైభోగమే అంటూ పలు భక్తి గీతాలను రమ్యంగా ఆలపించారు. సభికులను అలరించాయి. వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయశాస్త్రి, మృదంగంపై కాకరపర్తి జగన్మోహిని వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను సత్కరించారు.

పర్చూరులో బెట్టింగ్ బుకీలు

- కమీషన్‌లకు కక్కుర్తి పడి యువతను పెడత్రోవ పట్టిస్తున్న వైనం
- నిఘా విభాగం నిర్లక్ష్యం
- మరింత రెచ్చిపోతున్న బుకీలు
- పోలీసుల కంట పడకుండా పలు జాగ్రత్తలు



ఆన్‌లైన్‌లో బెట్టింగ్ జరిగే విధానం

పర్చూరు(చినగంజాం)
పర్చూరులో బెట్టింగ్ బుకీలు రెచ్చిపోతున్నారు. యువకులను టార్గెట్ చేస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. యువకులను బెట్టింగ్ వెబ్‌సైట్‌లకు ఆకర్షితులను చేసి తద్వారా వచ్చే కమీషన్‌లను దండుకుంటున్నారు. బుకీల మాయమాటలకు ప్రలోభపడి నగదు అప్పు తెచ్చి మరీ బెట్టింగ్‌లు పెడుతున్నారు. ఆ తర్వాత అప్పులు తీర్చలేని పరిస్థితులలో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుత యువతకు ఐపీఎల్ ఫీవర్ పట్టుకుంది. క్రికెట్ మ్యాచ్‌లు మొదలైన రోజు నుండి ఆన్‌లైన్‌లో బెట్టింగులు జోరందుకున్నాయి. బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువతను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన పోలీసు నిఘా విభాగం పూర్తిగా విఫలమైందని పలువురు విమర్శిస్తున్నారు.

యువతకు రుణ సౌకర్యం

బెట్టింగులు పెట్టడానికి యువకుల వద్ద తల్లి దండ్రులు ఇచ్చే డబ్బులు ఉండాల్సిన పని లేదు. లోన్ యాప్‌ల ద్వారా రుణాలు పొందే అవకాశాలు ఇప్పుడు మెండుగా ఉన్నాయి. ఆధార్, పాన్, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నంబర్ తదితర వివరాలతో లోన్ యాప్‌ల ద్వారా రుణాన్ని పొందవచ్చు. రుణంగా పొందిన డబ్బులు మొత్తాన్ని యువకులు అమాయకంగా బెట్టింగులలో పెట్టి పోగొట్టుకుంటున్నారు. అనంతరం లోన్ యాప్‌ల ద్వారా ఎదురయ్యే ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి.

ముగ్గులోకి దించుతున్న బుకీలు

క్రికెట్ బెట్టింగ్ జరిగే విధానాన్ని చూసి అందరూ బిత్తర పోతున్నారు. బెట్టింగ్‌లో పాల్గొనదలచిన వారు తొలుత తమ పేర్లను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. ప్రస్తుతం వన్ ఎక్స్ బెట్, రెడ్డి అన్న బుక్, ఫెయిర్ బెట్ తదితర బెట్టింగ్ వెబ్‌సైట్‌లు లీడింగ్‌లో ఉన్నాయి. వన్ ఎక్స్ బెట్ యునైటెడ్ కింగ్ డమ్ కేంద్రంగా పనిచేస్తుండగా, రెడ్డి అన్న బుక్ ఫెయిర్ బెట్ చెన్నై కేంద్రంగా పనిచేస్తున్నాయి. వీటిలో బెట్టింగ్ రాయుళ్లు ముందుగా తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్న తరువాత కంపెనీ వారు ఒక క్యూఆర్ కోడ్‌ను పంపుతారు. క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి మన ఖాతాలో ఉన్న డబ్బులను బెట్టింగ్ వెబ్‌సైట్ ఖాతాలోకి మళ్లిస్తారు. మనం పంపించే డబ్బులను పాయింట్‌లలో లెక్కిస్తారు. ఉదాహరణకు మనం రూ.500 బెట్టింగ్ వెబ్‌సైట్‌లోకి మరలిస్తే మనకు కంపెనీ వారు 500 పాయింట్లు ఇస్తారు. వెబ్‌సైట్‌లో రిజిస్టర్ కాబడిన వ్యక్తి ఇతర వ్యక్తులను కంపెనీకి రిఫర్ చేసినట్లయితే ఒక్కో వ్యక్తికి ఐదు పాయింట్లు చొప్పున కంపెనీ అతనికి అదనంగా ఇస్తుంది. ఈ అదనపు పాయింట్లే కమీషన్ కాగా ఇవి రిఫర్ చేసిన వ్యక్తి ఖాతాలోకి పాయింట్ల రూపంలో వెంటనే జమ అవుతాయి. ఈ విధంగా వేరే వ్యక్తులను బెట్టింగ్ కంపెనీలకు రిఫర్ చేసి కమీషన్‌లు దండుకునే చిన్నచిన్న బుకీలు ప్రస్తుతం పర్చూరులో తయారయ్యారు. క్రికెట్ ఆట మొదలైన తరువాత ఏ టీమ్‌కు గెలిచే అవకాశాలు మెండుగా ఉంటాయో ఆ టీమ్‌పై బెట్టింగ్ పెడతారు. క్రికెట్ ఆట జరిగేటప్పుడు మనం బెట్టింగ్ పెట్టిన టీమ్ ఓడిపోయే అవకాశం ఉందని భావిస్తే వెంటనే బెట్టింగ్ డబ్బులను మరో టీమ్‌పైకి మార్చుకోవచ్చు. అయితే తొలుత ఒక రూపాయికి 10 రూపాయలు వచ్చినట్లు బెట్టింగ్ వెబ్‌సైటు వారు నమ్మిస్తారు. వచ్చిన చిన్నపాటి నగదును మన ఖాతాలో వెంటనే జమచేస్తారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు నేరుగా నెఫ్ట్, ఆర్టీజీఎస్ ద్వారా మన ఖాతాల్లోకి డబ్బు జమ చేస్తారు. శని, ఆదివారాలలో అయితే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌ల ద్వారా జమ చేస్తారు. మనం ఎక్కువ మొత్తంలో నగదు గెలుచుకున్నప్పుడు వాటిని మన ఖాతాలోకి మళ్లించకుండా మన అకౌంట్‌ను బ్లాక్ చేస్తారు. మ్యాచ్‌ని ఓడిపోయే సమయంలో బోర్డుని మార్చుకోవడానికి కూడా అవకాశం ఉండదు. ఈ విధంగా బెట్టింగ్ కంపెనీ యువతను మోసం చేసి లాభాలను గడిస్తోంది.

కొరవడిన నిఘా

పోలీసులు రహస్యంగా గ్రామాల్లోని బెట్టింగ్ రాయుళ్ల వివరాలు సేకరించాలి. వారి బ్యాంక్ ఖాతాలను పరిశీలించి ఎక్కడి నుండి వారి ఖాతాలో తరచూ నగదు జమ అవుతుందో గమనించాలి. బెట్టింగ్ ఖాతాల నుంచి నగదు జమ అవుతుంటే అతడ్ని అనుమానించి అతని వద్ద నుంచి ఇతరుల పూర్తి సమాచారాన్ని రాబట్టాలి. బెట్టింగ్‌కు పాల్పడుతున్న వారందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి మళ్ళీ అలాంటి తప్పు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వైద్య కళాశాల ల్యాబ్‌ను పరిశీలించిన కేంద్ర బృందం



గుంటూరు మెడికల్: పల్నాడు జిల్లాలో రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూతో మృతి చెందడంతో నిర్ధారణ చేసేందుకు రెండు రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో కేంద్రం బృందం పర్యటిస్తోంది. పల్నాడు జిల్లాలో ఒక రోజు, మంగళగిరి ఎయిమ్స్‌లో మరోరోజు పరిశీలన అనంతరం మూడోరోజు శనివారం గుంటూరు వైద్య కళాశాలకు వచ్చింది. కళాశాలలోని వైరాలజీ ల్యాబ్ (వీఆర్‌డీఎల్)ను సభ్యులు పరిశీలించారు. నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూతో మృతి చెందిన చిన్నారి కుటుంబ సభ్యులు తొమ్మిది మందికి గుంటూరు వైద్య కళాశాల ల్యాబ్‌లో శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేశారు. ఈ నేపథ్యంలో ల్యాబ్‌లో ఉన్న వసతులు, వారికి చేసిన వైద్య పరీక్షల గురించి మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాణిశ్రీని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ నిర్వహణ, పనితీరు, వైద్య పరికరాలు, సిబ్బంది గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బృందంలో ఐడీఎస్‌పీ ఏపీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మల్లేశ్వరి, మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ భార్గవి రాజ్, ఎన్‌సీడీసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అంకూర్ గార్గ్, ఎన్‌సీడీసీ మైక్రోబయాలజిస్ట్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నిధి షైని, ఎయిమ్స్ మంగళగిరి పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీంద్ర, ముంబాయి ఐసీఎస్ఆర్ సైంటిస్ట్ డాక్టర్ శైలేష్ పవర్ ఉన్నారు.

సేవాదృక్పథం అలవరచుకోవాలి

అమరావతి: విశ్రాంత ఉద్యోగులు సేవాదృక్పథం అలవరచుకోవాలని పల్నాడు జిల్లా పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు మానం సుబ్బారావు అన్నారు. శనివారం అమరావతి యోగాశ్రమంలో నిర్వహించిన అమరావతి, పెదకూరపాడు మండలాల యూనిట్ ప్రభుత్వ పెన్షనర్ల సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈసమావేశానికి స్థానిక పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగంలో ఉన్నంతకాలం సర్వీసు చేయటమే కాకుండా రిటైర్ అయిన తరువాత కూడా సమాజం పట్ల బాధ్యతతో మెలగాలన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి సి.ఆదెయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అదనపు క్వాంటుకు పెన్షన్‌ను పెంపుదల చేయాలన్నారు. సైబరు నేరాలు, మోసాలు పెరిగిపోతు న్న నేటి రోజుల్లో పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాల న్నారు. జిల్లా కోశాధికారి ఎంఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడారు.

జగ్జీవన్‌రామ్ విద్యార్థి లోకానికి ఆదర్శనీయుడు

బాపట్ల :అణగారిన వర్గాల నుంచి వచ్చినప్పటికీ ఉన్నత విద్యను అభ్యసించి ఎన్నో ఉన్నత పదవులను అలంకరించిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విద్యార్థి లోకానికి ఆదర్శనీయుడని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు మరుప్రోలు కొండలరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సభ శనివారం నిర్వహించారు. కొండలరెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ ప్రారంభించిన అంటరానితనం వ్యతిరేక ఉద్యమంలోను, సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలోను చురుగ్గా పాల్గొన్నందుకు రెండుసార్లు జైలు శిక్ష అనుభవించిన జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశపు మొట్టమొదటి కార్మిక మంత్రిగా బాధ్యతలు నిర్వహించి ఆ పదవికే వన్నె తెచ్చారన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిగా వ్యవసాయాన్ని ఆధునీకరించడంలో ఆయన నిర్వహించిన పాత్ర గణనీయమైనదని, భారతదేశంలో హరిత విప్లవ సాధనలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనదన్నారు. 1974లో కరువు సంభవించినప్పుడు ఆ సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించి రైతాంగం మన్ననలు పొందారన్నారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, నాయకులు కొక్కిలిగడ్డ చెంచయ్య, పిన్నిబోయిన ప్రసాద్, జోగి రాజా, షోహిత్ తదితరులు పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాబూ జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

బాపట్లటౌన్ : బాబూ జగ్జీవన్‌రామ్ జీవితాన్ని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళుర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ అణగారిన వర్గాలు వివక్షకు గురౌతున్న తరుణంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం నిస్వార్థ పోరాటాలతో ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. అంటరానితనం వంటి అనేక సాంఘిక దురాచారాలను రూపుమాపటంలో తన వంతు కృషి చేశారన్నారు. ఆనాటి క్విట్ ఇండియా ఉద్యమం, శాసన ఉల్లంఘన ఉద్యమాల్లోనూ గాంధీజీతో కలిసి అడుగులు వేశారన్నారు.
అలాంటి గొప్ప నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడుని స్మరించుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆదర్శనీయమైన మహోన్నత వ్యక్తి నుంచి సద్గుణాలను అలవర్చుకుని సమాజం కోసం మనవంతు కృషి చేయాలన్నారు.ఏఆర్ డీఎస్పీ విజయసారధి, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, ఎస్‌బీ సీఐ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

అలరిస్తూ.. ఆలోచింపజేస్తూ..

కొనసాగుతున్న సుందరయ్య కళానిలయం జాతీయస్థాయి నాటికల పోటీలు



యడ్లపాడు: పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు రెండోరోజైన శనివారం కొనసాగాయి. రెండు రోజులు జరిగిన ఆరు ప్రదర్శనలు బంధాలు, వాటి విలువలు, సంప్రదాయాలు, సంస్కృతి గురించి వివరించాయి. నాటికలోని ప్రతి సంఘటన సమాజాన్ని సూటిగా ప్రశ్నిస్తూ ఆలోచనలను రేకిస్తుంది. ఈ కళారూపాల్ని తిలకించేందుకు కళాభిమానులు అధిక సంఖ్యలో తరలి రావడం, అర్ధరాత్రి వరకు అన్ని ప్రదర్శనల్ని ఎంతో ఆసక్తిగా తిలకించడం విశేషం.

మానవ సంబంధాల్లో శూన్యతను ప్రశ్నించే 'నా శత్రువు'..

ఆధునిక జీవనశైలిలో టెక్నాలజీ ఆధిపత్యాన్ని కేంద్రంగా తీసుకుని, మానవ సంబంధాల్లో ఎదురవుతున్న శూన్యతను బహిర్గతం చేస్తున్న ఇతివృత్తం 'నా శత్రువు' నాటిక. సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, సోషల్ మీడియా వంటివి సమయాన్ని మింగేస్తూ, మనుషుల మధ్య దూరాన్ని పెంచుతున్నాయని ఈ నాటిక స్పష్టంగా చూపిస్తుంది. కుటుంబ సంబంధాలు, అనుబంధాల విలువ తగ్గిపోతున్న నేపథ్యంలో, ఈ నాటిక ఒక హెచ్చరికగా నిలుస్తుంది. జయభేరీ థియేటర్స్ హైదరాబాద్ వారు సమర్పించిన ఈ నాటికను అక్కల తామేశ్వరయ్య రచించగా వద్దాది సత్యనారాయణ దర్శకత్వం వహించారు.

- అదేవిధంగా ఆధునిక ఆడపిల్లల స్వతంత్ర భావనలు, ఆడపిల్లలు భారం అన్నట్టుగా నమ్మే వక్ర భావజాలాన్ని సూటిగా విమర్శించిన 'రుతువు లేని కాలం', ఓ సామాన్య మహిళ రైల్వే శాఖపై సంధించిన అస్త్రంగా సాగిన 'జనరల్ బోగీలు' నాటికలు ఆలోచింపజేశాయి.

నంద్యాల, సూర్యాపేట ఎడ్లకు ప్రథమ బహుమతి

తెనాలి రూరల్: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహిస్తున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన, పశు పాల ప్రదర్శన పోటీలు ముగిశాయి. గత నెల 29వ తేదీ నుంచి జరుగుతున్న పోటీల్లో చివరి రోజైన శుక్రవారం సీనియర్స్ విభాగం పోటీలు నిర్వహించారు. 11 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. రాత్రి పొద్దు పోయే వరకు హోరాహోరీగా పోటీలు జరిగాయి. నంద్యాల జిల్లా పెదకొట్టలకు చెందిన జోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణ జిల్లా సూర్యాపేటకు చెందిన ఏఎస్సీ సుంకి సురేందర్‌రెడ్డి కంబైన్డ్ ఎడ్ల జత నిర్ణీత సమయంలో 3619.9 అడుగులు లాగి ప్రథమ బహుమతిని పొందాయి.తాడేపల్లికి చెందిన లంకిరెడ్డి నిక్షేత్‌రెడ్డి ఎడ్ల జత(3394.10 అడుగులు) రెండో బహుమతిని, ప్రత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత (3351.8 అడుగులు) మూడో బహుమతిని సాధించాయి. సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిగా బుల్లెట్ బండిని అందజేశారు. పోటీలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు పర్యవేక్షించారు.



ప్రథమ బహుమతి బుల్లెట్ బైక్‌ను అందుకుంటున్న ఎడ్ల జత ప్రతినిధి

నేల కొరిగిన నాలుగు విద్యుత్ స్తంభాలు

- తప్పిన పెను ప్రమాదం
- అప్రమత్తమైన కార్పొరేషన్, విద్యుత్ శాఖ అధికారులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు నగరంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షానికి అమరావతి రోడ్, ఆంజనేయస్వామి గుడి వద్ద వీధి లైట్ల కోసం వేసిన నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో తక్షణమే సరఫరా నిలిపివేశారు. స్తంభాలు కూలడంతో అమరావతి రోడ్‌లో ట్రాఫిక్‌కు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సంబంధిత అధికారులు అప్రమత్తమై ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోటేశ్వరరావు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్తంభాల పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, సిబ్బంది

కుటుంబ సభ్యుల చెంతకు చేరిన వృద్ధుడు

తాడేపల్లి రూరల్: ఎట్టకేలకు కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధుడు చేరాడు. ప్రకాశం జిల్లాకు చెందిన వృద్ధుడు దారితప్పి తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లికి చేరుకోవడంతో స్థానికులు ఆశ్రయమిచ్చిన సంగతి తెలిసిందే. తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య వృద్ధుడిని శుక్రవారం తాడేపల్లి ఆశ్రమానికి తరలించి, కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకున్నారు. కుంచనపల్లిలో ఉన్నారని సిబ్బంది ద్వారా సమాచారం రావడంతో శనివారం వారిని పిలిపించి అప్పగించారు. దీంతో వృద్ధుడి కుటుంబ సభ్యులు తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.